క్లుప్తంగా

తునికాకు కూలీకి తేలుకాటు

కొత్తగూడ : తునికాకు సేకరిస్తున్న కూలీ తేలు కాటుకు గురైన ఘటన మండలంలోని ముస్మి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కల్తి పద్మ కోటగుట్ట అటవీ ప్రాంతంలో తునికాకు సేకరిస్తుండగా తేలు కాటు వేసింది. ఆమెను తోటి కూలీలు చికిత్స కోసం స్థానిక పీహెచ్‌సీకి తరలించారు.

పారిశుధ్య పనులు



గార్ల : మండల కేంద్రంలో సర్పంచ్ అజ్మీర బన్సీలాల్ పంచాయతీ సిబ్బందితో పారిశుధ్య పనులు చేయించారు. గురువారం ఎంపీఓ రజిని, పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది జె.కిషోర్, కలీం, సుధాకర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌కు మూడ్రోజులు సెలవు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్, కేసముద్రంలోని వ్యవసాయ మార్కెట్లకు నేటి నుంచి మూడ్రోజులపాటు సెలవులు ఉంటాయని ఆయా మార్కెట్ కమిటీ చైర్మన్లు గురువారం ప్రకటనలో తెలిపారు. శుక్రవారం అమావాస్య, శనివారం, ఆదివారం వారాంతపు సెలవుల కారణంగా బంద్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ రోజుల్లో రైతులు మార్కెట్‌కు సరుకులు తీసుకురావద్దని కోరారు.

ఇంటర్ ప్రవేశాలకు 25 వరకు గడువు

మరిపెడ : ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం ఈనెల 25 వరకు నెట్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందని స్థానిక మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎలిజెబెత్ ప్రేమ్‌సాగర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

సామాజిక తనిఖీ సర్వే వివరాలు వెల్లడి

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని ఇస్లావత్ తండా (సింగారం)లో గడచిన మూడేళ్లలో చేపట్టిన ఈజీఎస్ పనులపై సామాజిక తనిఖీ బృందం సర్వే చేసింది. ఆ వివరాలపై సర్పంచ్ బోడా లక్ష్మణ్ నాయక్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన గ్రామ సభలో డీఆర్పీ మౌనిక వెల్లడించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నూనావత్ కిషన్, బానోత్ శ్రీను, పంచాయతీ కార్యదర్శులు షకీల్ అహ్మద్, ఎస్.వీరన్న, టెక్నికల్ అసిస్టెంట్ రంజిత్, దర్శనం నర్సయ్య పాల్గొన్నారు.

28న వార్షికోత్సవ మహాసభ

గూడూరు : ఈనెల 28న చాకలి ఎస్సీ సాధన సమితి 6వ వార్షికోత్సవ మహాసభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎదునూరి వెంకన్న తెలిపారు. మండల కేంద్రంలో రాసమల్ల యాకయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో వెంకన్న మాట్లాడారు. అనంతరం మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కృష్ణ, యాకయ్య, భాస్కర్, బుచ్చిరాములు, చిట్టిబాబు, వెంకన్న, సాయిలు, వీరస్వామి పాల్గొన్నారు.

వేసవి శిక్షణశిబిరాన్ని వినియోగించుకోవాలి

డోర్నకల్ : స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలని ఇన్‌చార్జ్ వెంపటి సీతారాములు గురువారం ఓ ప్రకటనలో కోరారు. శిక్షణ పొందే వారికి అల్పాహారం అందించేందుకు హైదరాబాద్‌కు చెందిన రేగళ్ల సతీష్‌రెడ్డి 20 కిలోల గోధుమ రవ్వతోపాటు కోడిగుడ్లు అందించారు. కార్యక్రమంలో విద్యాశాఖ జిల్లా కోఆర్డినేటర్ విత్తనాల సుధాకర్, హెచ్‌ఎంలు ఆంగోత్ లక్ష్మా, మరియా మాణిక్యం పాల్గొన్నారు.

నల్లబెల్లం పట్టివేత

పెద్దవంగర : మండలంలో 2 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ బూస అశోక్ తెలిపారు. మండల కేంద్రంలో ఎక్సైజ్ పోలీసులు గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. నల్లబెల్లం తరలిస్తుండగా పట్టుకుని మునుగోటి మధుపై కేసు నమోదు చేశారు.

'ప్రత్యామ్నాయ దారి నిర్మించండి'

గార్ల : గార్ల పాకాల ఏటి బ్రిడ్జి వద్ద రైల్వే లైన్ ట్రాక్ పనుల కోసం రాంపురం నుంచి గార్లకు వచ్చే రహదారిని రైల్వే కాంట్రాక్టర్ మూసివేస్తున్న క్రమంలో ప్రత్యామ్నాయ రహదారి నిర్మించాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కొమర్రాజు జగదీష్ డిమాండ్ చేశారు. పనుల్లో భాగంగా రహదారికి అడ్డంగా రైల్వే కాంట్రాక్టర్ తాళ్లను కట్టించారు. దీంతో ప్రత్యామ్నాయ దారి నిర్మించాలని జగదీష్ కోరారు.

లేఅవుట్ లేని ప్లాట్లను కొనుగోలు చేయొద్దు

● వెంచర్ వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

మహబూబాబాద్ : లేఅవుట్‌లేని ప్లాట్లను కొనుగోలు చేయొద్దని టౌన్ ప్లానింగ్ అధికారి (టీపీఓ) నవీన్ కోరారు. ఈనెల 18న 'సాక్షి' పత్రికలో వచ్చిన కథనానికి మున్సిపల్, రెవెన్యూ అధికారులు గురువారం స్పందించారు. మానుకోట మున్సిపాల్టీ పరిధిలోని 18వ వార్డులోని భవానీ శంకర్ తండా సమీపంలో ఏర్పాటు చేసిన వెంచర్‌లోని హద్దురాళ్లను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో టీపీఎస్ ప్రవీణ్‌బాబు మున్సిపల్ సిబ్బందితో వెళ్లి హద్దులను తొలగించి ప్లాట్లను కొనుగోలు చేయొద్దని తెలుపుతూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీపీఓ నవీన్ మాట్లాడారు. కొందరు రియల్టర్లు లేఅవుట్ లేకున్నా ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని తెలిపారు. సదరు రియల్టర్లకు నోటీసులు జారీ చేసి క్రిమినల్ కేసులు పెడతామని చెప్పారు.



హద్దురాళ్లను తొలగిస్తున్న సిబ్బంది



ఫ్లెక్సీ ఏర్పాటు చేయిస్తున్న టీపీఎస్ ప్రవీణ్‌బాబు

ఆ ప్లాట్లను కొనుగోలు చేస్తే నిర్మాణాలకు అనుమతులు రాకపోగా బ్యాంక్ రుణాలు, ఇతర అవకాశాలు లభించవని స్పష్టం చేశారు. అలాంటి ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నివేదిక అందజేస్తామన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులు కూడా ఆ వెంచర్‌ను సందర్శించారు. నాలా పూర్తి స్థాయిలో లేని విషయంలో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వీఓఏల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

మహబూబాబాద్ : తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. అనంతరం ఆర్డీఓ కొమురయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం, సీఐటీయూ నాయకులు సమ్మెట రాజమౌళి, కుమ్మరికుంట్ల నాగన్న మాట్లాడారు. వీఓఏలు 31 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. అనేక ఏళ్లుగా వీఓఏలు తక్కువ వేతనంతో పని చేస్తున్నారని తెలిపారు. వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీఓఏల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు తప్పవన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణవేణి, లలిత పాల్గొన్నారు.

పండ్లు అమ్ముతూ వీఓఏల నిరసన

గార్ల : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని నెహ్రూ సెంటర్‌లో వీఓఏలు గురువారం పండ్లు అమ్ముతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీఓఏల ఆందోళనకు కాంగ్రెస్ నాయకులు ఎం.వెంకట్‌లాల్, తదితరులు సందర్శించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వీఓఏలు ఉమ, అనిత, వీరలక్ష్మి, రమ, చంద్రకళ, కల్పన, శారద, స్వామి, సురేష్, సైదులు, విజయ్, శ్రీకాంత్, మంగీలాల్, వెంకటలక్ష్మి, రజిని, స్వప్న, విజయకుమారి, అరుణ, సునీత పాల్గొన్నారు.



పండ్లు అమ్ముతూ నిరసన తెలుపుతున్న వీఓఏలు

హెడ్ పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు

మహబూబాబాద్ : జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్టాఫీస్‌లో ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆధార్ సేవలు లభిస్తాయని సీపీసీ మేనేజర్ కె.సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా నమోదుతోపాటు అడ్రస్, పేర్లలో మార్పులు, మొబైల్ నంబర్ అనుసంధానం, బయోమెట్రిక్ అప్‌డేషన్, తదితర సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఐదు నుంచి 15 ఏళ్ల వరకు వయస్సున్న బాల బాలికల వేలిముద్రలను, ఫొటోను తప్పనిసరిగా అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు.

అవగాహనతో ఆరోగ్య పరిరక్షణ

నెహ్రూసెంటర్ : అవగాహన కలిగి ఉంటే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని మెడికల్ ఆఫీసర్ అబ్దుల్ రవూఫ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో అర్బన్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎండల తీవ్రత, కొంత కాలంగా గుండె సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వడదెబ్బ బారిన పడకుండా అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం జె.విజయ్, హెచ్ఈఓ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ అబ్దుల్ రవూఫ్

మేధాశక్తి పెంచేలా శిక్షణ



శిక్షణ ఇస్తున్న చిట్టిబాబు

డోర్నకల్ : 'షైన్‌మైండ్స్' సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జైన్‌భవన్‌లో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మేధాశక్తి పెంచేలా ప్రత్యేక పద్ధతుల్లో శిక్షణ ఇస్తున్నారు. కళ్లకు గంతలు కట్టుకుని కాగితాల రంగును, వాటిపై వేసిన బొమ్మలను, కరెన్సీ నోట్లను గుర్తించేలా తర్ఫీదు ఇస్తున్నారు. జ్ఞాపక శక్తిని పెంచేలా, మెదడుకు ప్రశాంతత కలిగించేలా ప్రత్యేక రీతుల్లో వ్యాయామం చేయిస్తున్నారు. ఈ సందర్భంగా షైనింగ్ మైండ్స్ సంస్థ ఫెసిలేటేటర్ జి.చిట్టిబాబు మాట్లాడారు. విద్యార్థుల్లో మేధాశక్తి, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళన

బయ్యారం : ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మండలంలోని గౌరారంలోని కొనుగోలు కేంద్రం వద్ద రైతులు గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ గ్రామ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి నెలరోజులు గడుస్తున్నా కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. ఇకనైనా వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, సత్యనారాయణ, బుచ్చయ్య, మల్సూర్, బస్వయ్య, వెంకటాచారి, వెంకన్న, మధుకర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నాయకులు, తదితరులు

'వినియోగదారుల' మండలి ప్రతినిధుల పరిశీలన

కురవి : మండలంలోని నేరడలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వినియోగదారుల సంక్షేమ మండలి ప్రతినిధులు గురువారం పరిశీలించారు. ధాన్యం క్లీనింగ్ యంత్రాలు సక్రమంగా పని చేయకపోవడంతో తాలుతోపాటు ధాన్యం పోతుండడంతో రైతులు నష్టపోతున్నారని, లారీల కొరత వల్ల ధాన్యం తూకం వేసి 15 రోజులు గడుస్తున్నా మిల్లులకు తరలించడం లేదని గుర్తించారు. ఈ సందర్భంగా వినియోగదారుల సంక్షేమ మండలి ప్రధాన కార్యదర్శి మైసా శ్రీనివాసులు, డీసీఐసీ సభ్యుడు షేక్ జానీ, ఎంసీడబ్ల్యూస్ సభ్యులు బి.రమేష్, శేఖర్ మాట్లాడారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ధాన్యం తరలించేందుకు సరిపడా లారీలను ఏర్పాటు చేయాలని, ప్యాడీ క్లీనింగ్ యంత్రాలను సమకూర్చాలని, త్వరగా కాంటా వేయాలని చెప్పారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సభ్యులు

నల్లమట్టి నిల్వపై చర్యలు తీసుకోవాలి

నెల్లికుదురు : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నల్లమట్టిని తరలించి నిల్వ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మండలంలోని రామన్నగూడెం గ్రామ పరిధిలోని ఓ ఇటుక బట్టీ వద్ద నెల్లికుదురు–రామన్నగూడెం గ్రామాల పరిధిలోని పెద్ద చెరువు నుంచి సుమారు 100 ట్రిప్పుల నల్లమట్టిని ఇటుక బట్టీ నిర్వాహకుడు అక్రమంగా తరలించి నిల్వ చేశాడు. రైతులు వ్యవసాయ పొలాల్లో పోసుకునేందుకు తరలించాల్సిన నల్లమట్టిని ఇటుక బట్టీ నిర్వాహకుడు అక్రమంగా నిల్వ చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇకనైనా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రెండో సంతకందారుగా గణేష్

నెల్లికుదురు : మండలంలోని శ్రీరామగిరి పంచాయతీ పాలన సౌలభ్యం కోసం సర్పంచ్‌తోపాటు రెండో సంతకందారుగా వార్డు సభ్యుడు పోరండ్ల గణేష్‌ను ఎంపిక చేసినట్లు ఎంపీఓ పార్థసారధి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడారు. ఉపసర్పంచ్ గంజి గోవర్ధన్‌పై గత నెల 27న తొర్రూర్ ఆర్డీఓ రమేష్ అధ్యక్షతన నిర్వహించిన అవిశ్వాస తీర్మానంలో ఏడుగురు వార్డు సభ్యులు ఆమోదం తెలిపిన క్రమంలో అది నెగ్గిందన్నారు. ఈ క్రమంలో ఆర్డీఓ ఆదేశాల మేరకు సర్పంచ్ డొనికెన జ్యోతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో 6వ వార్డు సభ్యుడు పోరండ్ల గణేష్‌ను రెండో సంతకం చేసే సభ్యుడుగా ఎంపిక చేసినట్లు వివరించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి అమ్జద్ అలీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీఓ పార్థసారధి

'సమ్మాన్ సేవింగ్'ను వినియోగించుకోవాలి

గార్ల : ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను పురస్కరించుకుని మహిళా సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన «మహిళా సమ్మాన్ సేవింగ్» సర్టిఫికెట్‌ను మహిళలు వినియోగించుకోవాలని స్థానిక సబ్ పోస్ట్‌మాస్టర్ బి.నాగరాజు కోరారు. స్థానిక పోస్టాఫీస్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మహిళలు, బాలికల కోసం ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్ పొదుపు ఖాతాలను ఆకర్షణీయమైన వడ్డీతో ప్రారంభించిందని, డిపాజిట్లపై 7.5 శాతం వడ్డీ లభిస్తుందన్నారు. సమావేశంలో శ్రీనివాసరావు, బాలరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై విచారణ చేయాలి

కురవి : మండలంలోని కొత్తూరు(జీ) శివారు బంచరాయి తండా జీపీలో జరిగిన అభివృద్ధి పనులపై విచారణ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు బానోత్ దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందచేశారు. అనంతరం దేవేందర్ మాట్లాడారు. విచారణ చేయకుంటే ఆందోళనలు తప్పవన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న దేవేందర్

మాజీ ఎంపీటీసీ కుటుంబానికి పరామర్శ

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని మల్యాలకు చెందిన మాజీ ఎంపీటీసీ వేల్పుల వెంకన్న ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ పార్టీ నేత పోరిక బలరాంనాయక్ గురువారం పరామర్శించారు. ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మేకల వీరన్న యాదవ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట వెంకన్న, మాజీ జెడ్పీటీసీ హెచ్.వెంకటేశ్వర్లు, ఎన్‌ఎస్ యూఐ జిల్లా అధ్యక్షుడు రియాజ్ అన్సారీ, టీపీసీసీ సోషల్ మీడియా కార్యదర్శి అంబాల శివకుమార్, నాయకులు సీతారాంరెడ్డి, తదితరులున్నారు.



మహబూబాబాద్ రూరల్ : వెంకన్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న బలరాంనాయక్

బీమా చెక్కు అందజేత

గూడూరు : మండలంలోని సీతానాగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త చొప్పదండి సాంబయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాంనాయక్ రూ.2 లక్షల బీమా చెక్కు అందించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి స్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నూనావత్ రాధ, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు యాకూబ్ పాషబూ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల నరేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

తొర్రూరు రూరల్ : మండలంలోని చెర్లపాలెంకు చెందిన ఆర్టీసీ కండక్టర్ ధర్మరాపు యాదగిరి గురువారం మృతి చెందగా ఆయన మృతదేహానికి జెడ్పీ ఫ్లోర్‌లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో రైతు మండల కోఆర్డినేటర్ అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు సట్ల నాగలక్ష్మి, అపావత్ సురేష్, శారద రమేష్, ఎంపీటీసీ ధర్మరాపు కిరణ్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు అనంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పత్తి విత్తనాల ధర తగ్గించాలని వినతి

గూడూరు : ఇటీవల పెంచిన పత్తి విత్తనాల ప్యాకెట్ ధరను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా సంయుక్త మండలాల కార్యదర్శి పైండ్ల యాకయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందించారు. అనంతరం యాకయ్య మాట్లాడారు. గతేడాది 450 గ్రాముల పత్తి విత్తనాల ప్యాకెట్ ధర రూ.700 ఉండగా ఇటీవల కేంద్రం రూ.743కు పెంచిందన్నారు. ప్రభుత్వం విత్తన కంపెనీల లాభాల కోసం ధరలు పెంచి రైతులపై భారం మోపుతోందన్నారు. కార్యక్రమంలో చారి పాల్గొన్నారు.

బయ్యారం : ప్రజాపంథా, ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాపంథా మండల కార్యదర్శి బిల్లకంటి సూర్యం మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఉమ్మగాని సత్యం, నారాయణరెడ్డి, పూర్ణ, రవి, అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

నెల్లికుదురు : మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ తరంగిణికి సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ కార్యదర్శి ఇరుగు అనిల్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మురళీ, రాము, వెంకన్న, యాకలక్ష్మీ పాల్గొన్నారు.

రైతులకు సహకరించాలి

● అడిషనల్ డీఆర్డీఓ వెంకట్

మహబూబాబాద్ రూరల్ : ధాన్యాన్ని విక్రయించే క్రమంలో రైతులకు సహకరిచాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అడిషనల్ డీఆర్డీఓ డాక్టర్ సట్ల వెంకట్ స్పష్టం చేశారు. మండలంలోని అమనగల్ శివారులోని రాజేశ్వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించి కొనుగోళ్లను పరిశీలించారు. కొనుగోళ్లపై ఆరా తీశారు. నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కొనుగోళ్ల వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబులో నమోదు చేయాలని చెప్పారు. బాధ్యులు కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటూ కొనుగోళ్లు చేపట్టాలని తెలిపారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ డీఆర్డీఓ వెంకట్

పంచాయతీ కార్యదర్శిపై చర్య తీసుకోండి

దంతాలపల్లి : మండలంలోని గున్నెపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మృతుల ఫొటోలతో గ్రామస్తులు గురువారం ఆందోళన చేపట్టారు. గ్రామ కార్యదర్శి రెండు, మూడేళ్లుగా గ్రామంలోని చనిపోయిన సుమారు 29 మందికి సంబంధించిన ఆసరా పింఛన్లను కాజేస్తోందని ఆరోపించారు. 2002లో గ్రామానికి చెందిన అల్లి సుభద్ర, కొండ రాధమ్మ, ఉప్పల పుల్లయ్య, 2021లో గుగులోత్ పాండ్యా, కోడిమల్ల రామక్క మృతి చెందినా వారి పింఛన్ డబ్బులను 2023 జనవరి వరకు తీసుకున్నట్లు ఆరోపించారు. ఇప్పటివరకు సమారు రూ.15 లక్షలు అక్రమంగా తీసుకుందని చెప్పారు. ఈ విషయమై ఉన్నతాధికారులు విచారణచేపట్టి చర్యలు తీసుకోవాలని మృతుల కుటుంబీకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కడుదుల మధుకర్‌రెడ్డి, ఉప్పల్‌రెడ్డి, శ్రీనివాస్, అల్లి వెంకన్న, ఉప్పల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న బాధితులు, గ్రామస్తులు

అవినీతి ఆరోపణల్లో వాస్తవం లేదు

● పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

కొత్తగూడ : మండలంలోని పొగుళ్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో అవినీతి జరిగినట్లు సోషల్ మీడియాలో వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని చైర్మన్, ఓడీసీఎంఎస్ వైస్ చైర్మన్ దేశిడి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం అభివృద్ధి కోసం స్థలాన్ని సేకరించి గోదాము, కార్యాలయ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. డైరెక్టర్లను కొందరు తప్పుదోవ పట్టించడంతో అవిశ్వాసానికి దరఖాస్తు చేశారని చెప్పారు. అధిష్టానం చొరవతో కొంతకాలంగా నెలకొన్న అనిశ్చితి తొలగిందన్నారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ కమలమ్మ, డైరెక్టర్లు వేణు, కొమురెల్లి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ఈజీఎస్‌ను పటిష్టంగా అమలు చేయాలి

కురవి : ఉపాధి హామీ పథకాన్ని (ఈజీఎస్) పటిష్టంగా అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య డిమాండ్ చేశారు. మండలంలోని రాజోలులోని దామెర చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన ఆధ్వర్యంలో పరిశీలించారు. అనంతరం వీరయ్య మాట్లాడారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు తగ్గించిందని చెప్పారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, కూలీలకు కూలీబంధు కింద రూ.30 వేలు బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, 16 రకాల నిత్యావసర వస్తువులను అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల కార్యదర్శి షేక్ మల్సూర్, నాలం వెంకన్న, రాయల మనోహర్, అనిల్, మల్లారపు సరోజ, అడిదల సుభద్ర, పాశం చంద్రమ్మ, సీతరాములు, కందాల పద్మ, సుశీల పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న వీరయ్య